

ఎస్‌ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

సాలూరు రూరల్/గరుగుబిల్లి, ఆగస్టు 1: పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 1,582 పాఠశాలలకు గురువారం నోటిఫికేషన్ విడుదలైనట్లు డీఈవో జి.పగడాలమ్మ తెలిపారు. ఈ నెల 5న జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. ఆ తర్వాత తుది జాబితా ప్రకటిస్తారని వెల్లడించారు. 8న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేరోజు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, కమిటీతో తొలి సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణ కోసం ఎంఈవోలు, హెచ్‌ఎంలు, టీచర్లకు మార్గనిర్దేశం చేశామని స్పష్టం చేశారు.

తొలిరోజే 97.44 % పింఛన్ల పంపిణీ



సాలూరులో ఓ వృద్ధుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

- పండగలా సాగిన ప్రక్రియ
- భాగస్వాములైన మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు
- ఉత్సాహంగా పాల్గొన్న కూటమి శ్రేణులు
- ఉదయం ఆరు గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు సచివాలయ సిబ్బంది
- రూ.4వేల చొప్పున అందజేత



పార్వతీపురంలో పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



సీతానగరం: మరిపివలసలో పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పండగలా సాగింది. గురువారం ఉదయం ఆరు గంటలకే సచివాలయ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కూటమి శ్రేణులు ఇందులో భాగస్వాములయ్యారు. అవ్వాతాతలను పలకరించి వారికి రూ. 4 చొప్పున అందించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ల సొమ్మును అందజేశారు. సాలూరు పట్టణంలో మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నేరుగా లబ్ధిదారులను కలిసి పింఛన్ సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల కింద జిల్లాలోని 1,43,398 మందికి రూ.59 కోట్ల 58 లక్షలు అందిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని తెలిపారు. పార్వతీపురం పట్టణంతో పాటు రూరల్‌లో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలసలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ నియోజకవర్గం భామినిలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సీతానగరం మండలం మరిపివలసలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పింఛన్లను పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ శోభిక, పార్వతీపురం ఐటీడీఏ పీవో సేదు మాధవన్ కూడా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తంగా శుక్రవారం రాత్రికి 97.44 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు అధికార వర్గాలు తెలిపాయి.



గిరిశిఖర గ్రామం చింతామలకు నడిచి వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి ఎర్రాయుడు

ఏడు కిలోమీటర్లు నడిచి.. కొండలెక్కి..

సాలూరు రూరల్: సాలూరు మండలంలోని పలు గిరిశిఖర గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు చేరుకుని శతశాతం పింఛన్లు అందించారు. సుమారు ఏడు కిలోమీటర్లు నడిచి.. కొండలెక్కారు. ఈ విధంగానే ఏవోబీలో ఎత్తయిన గిరిశిఖరాల్లో ఉన్న కొదమ పంచాయతీలో చింతామల, లొద్ద, బందపాయి గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. ఆయా గ్రామాల్లో 97 మంది లబ్ధిదారులకు మధ్యాహ్నంలోగా పంచాయతీ కార్యదర్శి ఎర్రాయుడు పింఛన్ సొమ్ము అందజేశారు. మరో పంచాయతీ కార్యదర్శి బిడ్డిక తిరుమలదొర ఉదయం పది గంటలలోగా జిల్లేడువలస కొండపై ఉన్న బొడ్డపాడు గ్రామానికి వెళ్లి అక్కడున్న 27 మందికి పింఛన్లు అందించారు. మొత్తంగా సాలూరు మండలంలో తొలిరోజు 8,433 సామాజిక పింఛన్లకుగాను 8214 పింఛన్లు (97.41 శాతం) అందించినట్లు ఎంపీడీవో ఫణీంద్రకుమార్ తెలిపారు. రూ.3.43 కోట్లను పంపిణీ చేసినట్టు ఆయన చెప్పారు.



కొండపై ఉన్న బొడ్డపాడు గ్రామంలో పారమ్మకు పింఛను అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి తిరుమలదొర



గుమ్మలక్ష్మీపురంలో పింఛన్ ఇస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



భామినిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

నేరాల నియంత్రణకు చర్యలు: ఎస్పీ

పాలకొండ, ఆగస్టు1: నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. గురువారం పాలకొండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కేంద్రం, రికార్డుల నిర్వహణ, ప్రాపర్టీ భద్రపరిచే గదులను పరిశీలించారు. సీఐ, డీఎస్పీ క్వార్టర్స్ తనిఖీ చేశారు. పాడైన పోలీస్‌క్వార్టర్స్ ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. సిబ్బందికి కేటాయించిన విధులు, పని తీరుపై ఆరా తీశారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. రాత్రివేళల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ చేయాలని , రోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని సూచించారు. ప్రతి ఒక్క సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి

సీతంపేట: ఏజెన్సీలో రహదారి ప్రమాదాల నివారణపై దృష్టిసారించాలని ఎస్పీ మాధవరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్, బ్యారెక్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేకంగా దృష్టిసారించి.. ప్రమాదాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్‌ఐలు ప్రశాంత్, జగదీష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

నమ్మిన వాడే.. మోసం చేశాడని..

- ఓ మహిళ ఆత్మహత్యాయత్నం
- బ్లేడుతో పీక కోసుకుని కుప్పకూలిన వైనం
- జిల్లా ఆసుపత్రిలో చికిత్స
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

పార్వతీపురం టౌన్, ఆగస్టు 1 : నమ్ముకున్న వ్యక్తే.. తనను మోసం చేశాడని ఆవేదన చెందిన ఓ మహిళ బ్లేడుతో పీక కోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఓ సంఘ సమావేశంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎమ్మెల్యే చొరవతో ఆమెను హుటాహుటిన జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఔటు పోస్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

జిల్లా కేంద్రంలోని కాలనీలో తన కొడుకుతో కలిసి ఓ మహిళ నివసిస్తుంది. ఆమె భర్త మూడేళ్ల కిందట చనిపోయాడు. దీంతో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అయితే ఏడాది కిందట ఓ గ్యాస్ ఏజెన్సీలో డ్రైవర్‌గా పని చేస్తున్న శివకుమార్‌తో ఆమెకు పరిచయమైంది. ఆ పరిచయం కాస్త స్నేహంగా మారింది. కొద్దిరోజుల తర్వాత అండగా ఉంటానని ఆ మహిళకు శివకుమార్ మాటిచ్చాడు. దీంతో ఏడాదిగా వారు సహజీవనం చేస్తున్నారు. అయితే ఇటీవల ఆ వ్యక్తి తీరులో మార్పు వచ్చింది. 'నాకు..నీకు' ఏ సంబంధం లేదని తేల్చి చెప్పాడు. దీంతో ఆమె తీవ్ర మనస్తాపం చెందింది. గురువారం జిల్లా కేంద్రంలోని రాయగడ రోడ్డు శివారులోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో జరుగుతున్న పట్టణ పార్వతీదేవి కర్పెంటరీ, విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశానికి వెళ్లింది.. తనకు అన్యాయం జరిగిందంటూ బ్లేడుతో మెడపై కోసుకుని కుప్పకూలింది. దీంతో అక్కడున్న వారంతా షాక్‌కు గురయ్యారు. సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే విజయచంద్ర వెంటనే వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి ఆమెను జిల్లా ఆసుపత్రికి తరలించే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రాసుపత్రిలో ఆమెకు వైద్యులు అత్యవసర చికిత్సను అందిస్తున్నారు. దీనిపై ఔట్ పోస్టు పోలీసు కేసు నమోదు చేయగా.. పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయండి

- జీసీసీ అధికారులకు ఐటీడీఏ పీవో ఆదేశం

సీతంపేట: గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులు కొనుగోలుపై గిరిజన సహకార సంస్థ అధికారులు దృష్టి సారించాలని సీతంపేట ఐటీడీఏ పీవో టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సీతంపేటలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాపార సముదాయాలను పరిశీలించారు. డీఆర్ డిపో ద్వారా ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందించాలన్నారు. గిరిజనులకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జీసీసీ డీఎం సంధ్యారాణి, మేనేజర్ దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జీసీసీ వ్యాపార సముదాయాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

గిరిజన వర్సిటీని

రెల్లిలోనే ఏర్పాటు చేయాలి

- లోక్‌సభలో ప్రస్తావించిన విశాఖ ఎంపీ శ్రీభరత్

కొత్తవలస, ఆగస్టు 1 : కేంద్రప్రభుత్వ విద్యాసంస్థ గిరిజన యూనివర్సిటీని కొత్తవలస మండలం రెల్లిగ్రామంలో ఏర్పాటు చేయాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ గురువారం లోక్‌సభలో కేంద్రాన్ని కోరారు. అసలు ఈ యూనివర్సిటీని రెల్లి గ్రామంలోనే ఎందుకు ఏర్పాటు చేయాలనే విషయమై పలు అంశాలను సభలో ప్రస్తావించారు. గత టీడీపీ హయాంలోనే అక్కడ 526 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారని, భూములిచ్చిన గిరిజనులకు ఇళ్ల స్థలాలను కూడా మంజూరు చేశారని, కేంద్ర అధికార బృందాలు కూడా రెల్లి భూములను పరిశీలించి వర్సిటీ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయని నిర్ధారించినట్లు గుర్తు చేశారు. రూ.5 కోట్లతో ప్రహరీ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. కొత్తవలస మండలంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే రోడ్డు, రైల్, ఎయిర్‌పోర్టు కనెక్టవిటీ కూడా అందుబాటులో ఉంటుందని చెప్పారు. రెల్లి గ్రామం విశాఖకు దగ్గరగా ఉండడం వల్ల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఇతర ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలుగా ఉంటుందని వివరించారు. గిరిజన యూనివర్సిటీని కొత్తవలస మండలంలోనే ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

నిత్యం అవస్థలే..

- విద్యార్థులకు తప్పని ప్రమాదకర ప్రయాణం



బస్సు ఎక్కేందుకు తోసుకుంటున్న విద్యార్థులు

భామిని: భామిని మండలంలో ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. వారికి సరిపడా బస్సులు లేకపోవడం.. ఉన్నవి సకాలంలో రాకపోవడంతో వారు ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోంది. గురువారం నాలుగు గంటల తర్వాత బస్సులు లేకపోవడంతో విద్యార్థులంతా భామిని సెంటర్‌లోని గంటన్నర పాటు పడిగాపులు కాశారు. అదే సమయంలో బత్తిలి వైపు వచ్చిన ఓ బస్సుకు వారంతా ఎగబడ్డారు. లోపల నిలబడడానికి కూడా చోటు లేకపోవడంతో కొంతమంది ఫుట్‌పాత్ మీద ఒంటికాలిపై నిల్చోవల్సి వచ్చింది. గమ్యస్థానాలకు చేరే వరకు ఇదేవిధంగా వారు ప్రయాణించారు. రోజూ వారికి ఈ పాట్లు తప్పడం లేదు. బత్తిలి వైపు నుంచి భామినికి వచ్చే సుమారు 400 మంది విద్యార్థుల కోసం అదనంగా బస్సులను నడపాల్సి ఉంది. అయితే ఈ రూట్‌లో నడిపే అరకొర బస్సులు కూడా సమయానికి రాకపోవడంతో చాలామంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. సాయంత్రం వేళల్లో బస్సులు ఆలస్యంగా రావడం వల్ల నులకజోడు, వడ్డంగి, లోహరజోల, నేరడి తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు స్వగ్రామాలకు చేరుకోవడానికి తీవ్ర ఇక్కట్లపాలవ్వాల్సి వస్తోంది. ఏబీ రోడ్డుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఆయా గ్రామాలు ఉండడంతో వారికి నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



బస్సు ఫుట్‌పాత్‌పై వేలాడుతూ.. ప్రమాదకరంగా ప్రయాణం


studio green
BESTEST ENTERTAINMENT
SINGLE SCREENS
RS. 99/-
@ THE BESTEST PRICE
MULTIPLEXES
RS. 125/-
ALLU SIRISH'S
బడ్డీ
SAM ANTON
FROM TODAY
NETFLIX


నేడే బ్రహ్మాండమైన విడుదల
తిరగబడరసామి...


VIJAYA BHASKAR KRAFT
A VIJAYA BHASKAR FILM
నేడే విడుదల
SREE KAMAL TANVI AKAANKSHA
ఉషాపరిణయం
Love is Beautiful..!
WRITTEN, PRODUCED & DIRECTED BY
VIJAYA BHASKAR K


SRI NEELAKANTA MAHADEVA ENTERTAINMENTS LLP
PVR INOX PICTURES RELEASE
నేడే విడుదల
Average Student నాని
IN THEATRES
2
AUGUST


IN CINEMAS AUG 2nd
SVC RELEASE
అలనాటి రామచంద్రుడు
నేడే విడుదల


INFINITI FILM VENTURES
IN THEATRES AUGUST 9TH
VIJAY ANTONY
తుఫాన్
S.D.VIJAY MILTON
KAMAL BOHRA | D. LALITHA | B.PRADEEP | PANKAJ BOHRA


M3 MEDIA
MAHARSHI KONDLA PRESENTS
SINGLE SCREENS RS 99
MULTIPLEXES RS 112
You Are TRAPPED
VARUN SANDESH
విరాజీ
ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 2న విడుదల
నేడే విడుదల
SABARI


MEGA BLOCKBUSTER
2ND WEEK
KALANITHI MARAN
DHANUSH
రాయన్
IN CINEMAS NOW

తల్లిపాలు అమృత సమానం: కలెక్టర్

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 1: తల్లిపాలు అమృతంతో సమానమని జిల్లా కలెక్టరు బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను గురువారం ఘోషాసుపత్రిలో ప్రారంభించారు. తల్లిపాల శ్రేష్టతను వివరిస్తూ రూపొందించిన గోడపత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు భాస్కరరావు మాట్లాడుతూ, తల్లిపాలు బిడ్డకు టీకాతో సమానమన్నారు. కార్యక్రమంలో మహారాజా ఆసుపత్రి సూపరిడెంట్‌ంట్ డాక్టరు అప్పలనాయుడు, ఘోషాసుపత్రి చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టరు సుజాత, డీసీహెచ్ఎస్ డాక్టరు గౌరీ శంకర్, డీఐఓ అచ్యుతాకుమారి, గైనకాలజీ విభాగాధిపతి డాక్టరు శుభశ్రీ, ఇతర వైద్యులు, బాలింతలు పాల్గొన్నారు.



భోగాపురం: పౌష్టికాహారం అందిస్తున్న ఆర్డీడీ చిన్మయదేవి

● ఘోషాసుపత్రి ఆరోగ్యమిత్రపై జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ విభాగాన్ని కలెక్టర్ పరిశీలించగా అక్కడి ఆరోగ్య మిత్ర శ్రీనివాసరావు పనితీరుపై ఫిర్యాదు చేయడంతో కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆరోగ్యమిత్రను విధుల నుంచి తప్పించాలని డీఎంహెచ్ఓ భాస్కరరావును ఆదేశించారు. ● **బాడంగి:** తల్లిపాలు శ్రేష్ట మైనవని, వాటిని పిల్లలకు తప్పనిసరిగా తల్లులు ఇవ్వాలని సీడీపీవో రాజ్య లక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగమణి, గౌరీ, శ్రీదేవి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. ● **బొబ్బిలి రూరల్:** బొబ్బిలి మండలం శివడవలసలో గురువారం ప్రపంచతల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ బొబ్బిలి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వై.రాజి పర్యవేక్షణలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆగస్టు 1 నుంచి 7 వరకు జరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నారు. ● **రేగిడి:** తల్లిపాలు ఆవశ్యకతపై విస్తృత చైతన్యం తీసుకురావాలని బూరాడ వైద్యాధికార్లు డా.చలమయ్య, రీనాచౌదరి పేర్కొన్నారు. మండలంలో బూరాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం తల్లిపాలు వారోత్సవాలపై చైతన్యర్యాలీ, గర్భిణులకు, తల్లులకు అవగాహన కల్గించారు. బూరాడ పీహెచ్‌సీ ఎంపీఈవో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలను పర్యవేక్షించారు. ● **గజపతినగరం:** తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.శంకుతల అన్నారు. గురువారం తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కెంగువ, లోగిస గ్రామాల్లో తల్లి పాలుపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

భోగాపురం: తల్లిపాలు ప్రయోజనాలపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ఆర్డీడీ చిన్మయిదేవి అన్నారు. పోలిపల్లి గ్రామంలో తల్లిపాలు వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీ ఆవరణలో మానవహారం నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారం అందించారు. ● **గుర్ల:** తల్లిపాలకు మించిన ఔషధం మరొకటి ఉండదని గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి చెన్నై డాక్టర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శకుంతల, రాధిక, మండల వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● **బొండపల్లి:** బిడ్డలకు తల్లిపాలు అందించడంలో తల్లులు నిర్లక్ష్యం వహించరాదని గంట్యాడ సీడీపీవో ఉమాభారతి అన్నారు. గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్స వాలు సందర్భంగా గొట్లాం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు జానకి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బియ్యం, కందిపప్పు విక్రయం

కలెక్టరేట్: జిల్లాలోని వివిధ రైతు బజార్లు, పిడబ్ల్యూడి మార్కెట్, డి మార్ట్ , రిలయెన్స్, స్పెన్సర్ మోర్ తదితర మార్టుల్లో శుక్రవారం నుంచి తగ్గింపు ధరకు కందిపప్పు, బియ్యం విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు జేసీ కార్తీక్ తెలిపారు. దేశవాళీ కందిపప్పు కిలో రూ 155 నుంచి రూ 150 కి, బియ్యం (స్టీమ్), బీపీటీ, సోనమసూరి కిలో రూ.49 నుంచి రూ.48కి బియ్యం (రా) కిలో రూ.48 నుంచి రూ 47కు తగ్గించి విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన

విజయనగరం రింగురోడ్డు: నగరంలో పలు ప్రాంతాల్లో గురువారం కమిషనర్ ఎంఎం నాయుడు పర్యటించి ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. గంటస్థంబం ప్రాంతంలో పర్యటించి అక్కడున్న దుకాణాదారులకు ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే నష్టాల గురించి చైతన్య పరిచారు. అనంతరం గంటస్థంబం అనుకుని ఉన్న ప్రధాన కాలువలో పూడికతీత పనులు పరిశీలించారు. అలాగే రింగురోడ్డులో ఉన్న డంపింగ్ యార్డు ప్రాంతాన్ని పరిశీలించి వాహన రాకపోకలు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆలస్యంగా వస్తున్న వాహనాల వివరాలను తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు.

షాపులకు వేలం

విజయనగరం రింగురోడ్డు: నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న షాపులను బహిరంగ వేలాన్ని శుక్రవారం సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు కమిషనర్ ఎంఎం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌స్పోర్ట్సు కాంప్లెక్స్ వద్ద నూతనంగా నిర్మించిన 22 షాపులు, పాత, కొత్త ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా వున్న షాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల పాటదారులు బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

జాతీయభావం తొణికిసలాడాలి

బొబ్బిలి: జాతి, మత, కుల, వయోబేధం లేకుండా ప్రతి ఒక్కరిలో జాతీయ భావం తొణికిసలాడాలని ఏపీ విద్యార్థి జేఏసీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.సాయికిరణ్‌యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక రైల్వేజంక్షన్‌లో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం పక్షోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. మాజీ సైనికోద్యోగులు ఎస్.పోలయ్య, రేవెళ్ల కిరణ్, గోవిందనాయుడు, మోహన్, రవి అప్పలనాయుడు తదితరులను ఘనంగా సన్మానించారు. సంఘం నాయకులు చంద్రశేఖర్, గణేశ్, శివకుమార్, వెంకటరమణపట్నాయక్ తదితరులు ఉన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

బొబ్బిలి రూరల్: బొబ్బిలి మండలం దిబ్బగుడ్డివలస పంచాయతీ రాజచెరువు వలస గిరిజన గ్రామంలో గురువారం వనమిత్ర కృష్ణదాస్ 50 మంది వృద్ధమహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మానవతా వాదులు మానవతా దృక్పథంతో పేదలకు వస్త్రదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమరతసేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ ధూపం వాసు, గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

నేడు భవిత సెంటర్‌లో ఫిజియోథెరఫీ

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలోని స్థానిక ఫిజియోథెరఫీ సెంటర్‌లో నేడు ఫిజియోథెరఫీ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తారని సహిత విద్యావనరుల కేంద్రం ప్రతినిధులు తెలియజేశారు. ఫిజియోథెరఫీ అవసరమైన దివ్యాంగ పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సైనిక స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ బదిలీ

విజయనగరం టౌన్: కోరుకొండ సైనిక స్కూల్ వైస్ ప్రిన్సిపాల్, వింగ్ కమాండర్ శరవన్‌దాస్ కేశవన్‌కి బదిలీ అయ్యింది. మూడేళ్ల క్రితం వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన పాఠశాల అభివృద్ధికి క్రమశిక్షణతో విశేషమైన కృషి చేశారు. ఈ సందర్భంగా కోరుకొండ సైనిక పాఠశాలలో గురువారం సర్కారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ శాస్త్రి, పాఠశాల అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను ఘనంగా సత్కరించి సేవలను కొనియాడారు.

సమస్యలు పరిష్కరిస్తాం

విజయనగరం రింగురోడ్డు: ఘోషాసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని కలెక్టరు అంబేడ్కర్ హామీ ఇచ్చారు. పారిశుద్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు తమ సమస్యలను ఘోషాసుపత్రిలో కలెక్టర్‌కు వివరించారు. తమకు జీతాలు సక్రమంగా రావడం లేదని పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కూడా లేదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి, జీతాలు ఇవ్వకపోవడానికి గల కారణాలు తెలపాలని డీసీహెచ్ఎస్ గౌరీశంకర్‌కు ఆదేశించారు.

తహసీల్దార్ల నియామకంపై అసంతృప్తి

గరుగుబిల్లి: కురుపాం నియోజకవర్గం పరిధిలోని తహసీల్దార్ల నియామకంపై కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో తహసీల్దార్ల నియామకం చేసిన సమయంలో ఎటువంటి సమాచారం లేదన్నారు. తహసీల్దార్ల బదిలీపై బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. స్థానిక శాసనసభ్యులు సూచించిన వ్యక్తులను కాకుండా వేరే వారిని నియమించడంపై అభ్యంతరం తెలిపామన్నారు.

సర్పంచ్‌ను పరామర్శించిన జగదీశ్వరి

కొమరాడ: కంభవలస సర్పంచ్ వెంకటలక్ష్మిని కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం పరామర్శించారు. వెంకటలక్ష్మి భర్త అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జగదీశ్వరి సర్పంచ్ ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు.

క్వారీ సమస్యను పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం: రామచంద్రపేట గ్రామ సమీపంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి జీఎంఆర్ సంస్థ నిర్వహించనున్న క్వారీ ఏర్పాటును ప్రజలకు ఇబ్బంది లేకుండా నిలుపుదల చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి గ్రామస్థులకు హామీఇచ్చారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో సూర్యకళ, జీఎంఆర్ సంస్థ క్వారీ నిర్వాహకులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, రామచంద్రపేట గ్రామ నాయకులతో క్వారీ నిర్వహణపై చర్చించారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న క్వారీలు నిర్వహించడం కారణంగా అనేక మంది అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నామని రామచంద్రపేట గ్రామ నాయకులు తెలిపారు. క్వారీలో బాంబులు పెట్టి పేల్చడంతో రాళ్లు వచ్చి పడడంతో కొంతమంది గాయాలపాలయ్యారని, గ్రామమంతా దుమ్ముతో నిండుకుంటుందని, గృహాలు పగుళ్లు ఏర్పాటుతున్నాయని, ఇక్కడ నూతనంగా క్వారీ నిర్మించవద్దని గ్రామానికి చెందిన నాయకులు ఆర్డీవోకు, ఎమ్మెల్యేకు కోరారు. నూతన క్వారీ హైస్కూల్ పక్కనే నిర్వహిస్తే ఇక అందరం గ్రామం విడిచి వెళ్లిపోవల్సిందే అని మొరపెట్టుకున్నారు. అలాగే క్వారీ కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు, తదితర వాటిపై కర్రోతు బంగార్రాజు వివరించారు. దీనిపై ఆర్డీవో సూర్యకళ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేయనున్న క్వారీకి హైస్కూల్‌కు ఎంతదూరం ఉందని కొలతలు వేసి చూడాలని, అన్ని వివరాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ క్వారీ కారణంగా అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని, క్వారీ నిర్వహిస్తే ప్రజలు ఇంకా ఇబ్బందులు పడతారని సమస్య పరిష్కరించేలా సీఎం కార్యాలయ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సురేష్, కోలా రామసూరి, దుక్క రమణ, కోరాడ తాతారావు, సూరాడ చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.



క్వారీ నిర్వాహణపై చర్చిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

టిడ్కో లబ్ధిదారుల సమస్యలపై బేబీనాయన సమీక్ష

బొబ్బిలి, ఆగస్టు 1: స్థానిక టిడ్కో ఇళ్ల రుణాలకు సంబంధించి గురువారం బొబ్బిలి కోటలోని తన నివాసంలో ఎమ్మెల్యే బేబీనాయన బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో ఇంతవరకు 226 ఇళ్లకు రుణాలు మంజూరు చేశామని, ఈ రుణ వాయిదాలను చెల్లించేందుకు 24 నెలల మారటోరియం గడువు పూర్తయిపోయినా లబ్ధిదారులెవరూ తమ రుణాల వాయిదాలను చెల్లించడం లేదని బ్యాంకు అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. బకాయిల విషయంలో ప్రభుత్వం నుంచి చెల్లించేలా మంత్రితో, అధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనరు లాలం రామ లక్ష్మి, టిడ్కో ఈఈ, బ్యాంకు అధికారులు, టీపీఆర్‌వో జగన్మోహన్, సీఎంఎం, సీవోలు పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

రామభద్రపురం: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని బూసాయవలస ఫంక్షన్ హాల్లో బొబ్బిలి రూరల్ సీఐగా పదవీవిరమణ చేసిన ఎస్.తిరుమలరావును ప్రజా సంఘాలు, పోలీసులు, రాజకీయ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో పోలీసులు ఉద్యోగం చాలా బాధ్యతతో కూడుకున్నదని, ప్రజలకు రక్షణ కల్పించడంతోపాటు జవాబు దారీగా ఉండాలన్నారు. బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆయన సేవలను కొనియాడుతూ దుస్సాలువతో సత్కరించారు. బొబ్బిలి టౌన్ సీఐ ఎం.నాగేశ్వరరావు, విజయనగరం సీఐ బి.వెంకటరావు, గజపతినగరం సీఐ ఎంవి.ప్రభాకరరావు, స్పెషల్ బ్రాంచి సీఐ నరసింహమూర్తి తదితరులు పోలీసు శాఖలో ఆయన సేవలను కొనియాడారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు మడక తిరుతి నాయుడు తదితరులు ఉన్నారు.

మూడు జిల్లాల డ్వాక్రా మహిళలకు శిక్షణ పూర్తి

బొబ్బిలి: స్థానిక సూర్య రెసిడెన్సీలో మూడు జిల్లాల డ్వాక్రా మహిళలకు సఖి పేరుతో గ్యాస్ వినియోగంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలకు గ్యాస్‌స్టవ్‌లు, ధ్రువీకరణపత్రాలను రీజినల్ మేనేజర్ ప్రత్తి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జోనల్ డీజీఎంలు మురళీకృష్ణ, సంజీవకుమార్, ఏరియా సేల్స్ మేనేజరు కె.శ్రీహర్ష, మూడు జిల్లాల గ్యాస్ డీలర్లు జలగం ప్రసాదరావు, సాయికిరణ్, అనిల్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ సకాలంలో పూర్తిచేయాలి

రాజాం: డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సకాలంలో పూర్తిచేసి నివేదికలు అందించాలని వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ చిరంజీవి వెలుగు సిబ్బందిని ఆదేశించారు. ఉదయం 5 గంటలకు వెలుగు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి తక్కువ ప్రగతి ఉన్న గ్రామ సచివాలయ సిబ్బందితో మాట్లాడి వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సెర్ప్ సీఈవో, డీఆర్‌డీఏపీడీ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలి

పాలకొండ: విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలని ఉపవిద్యాశాధికారి పి.కృష్ణమూర్తి సూచించారు. చిన్నమంగళాపురం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థుల హాజరు పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను చదివారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రగతి మెరుగుపడాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రానున్న పరీక్షల్లో ప్రతి విద్యార్థి 500 మార్కులకు తక్కువ కాకుండా చూడాలన్నారు. ఎన్ఎంఎంఎస్, ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జామి రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు చర్యలు

రామభద్రపురం: లెప్రసీ నిర్మూలనకు కేంద్రప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని సెంట్రల్ లెప్రసీ ట్రైనింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వీరకుమారన్, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్టు డాక్టర్ కే.కుమారేసన్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి లెప్రసీ రోగులకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. కుష్టువ్యాధి రోగులను గుర్తించేందుకు గత నెల 18 నుంచి ప్రారంభించిన లెప్రసీ ఇంటింటి సర్వే ఎలా జరుగుతోంది అనే దానిపై స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, ఏఎల్‌జీ.శిరీషలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో గుర్తించిన లెప్రసీ రోగుల ఇంటికి వెళ్లి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు విలేఖర్లతో మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో లెప్రసీ రోగులు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించామని తెలిపారు.

విద్యాలక్ష్మికి విశేష పూజలు



విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 1: ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీక్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో విద్యాలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గురువారం ఉదయం దేవాలయ అర్చకులు చామర్తి రామేషాచార్యులు, చామర్తి శ్రీనివాస రమేషాచార్యులు సంయుక్తంగా వేద మంత్రాల నడుమ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చన నిర్వహించారు. దేవాలయ ధర్మకర్తలు ఉమా బాలాజీ, ఉమాదేవి దంపతులు పాల్గొన్నారు.

ఎక్కువ పదవులు సాధించాలి

తెర్లాం: జిల్లాపరిషత్, మండలపరిషత్ స్కూల్ చైర్మన్ ఎన్నికల్లో పదవులు అత్యధికంగా తెలుగుదేశం పార్టీ కైవశం చేసుకోవాలని మండలపార్టీ టీడీపీ అధ్యక్షుడు నర్సుపల్లి వెంకట నాయుడు తెలిపారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోడెల సింహాచలం, మండలనాయకులు యుగంధర్, శంకరరావు, అమరాపు సురేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు

విద్యార్థులకు అవగాహన

మక్కువ: మక్కువ నుంచి బొబ్బిలి పార్వతీపురం పట్టణాలకు వెళుతున్న విద్యార్థులను, తోటి ప్రయాణికులను కొంతమంది ఆకతాయిలు ఇబ్బందులు పెడుతున్నట్టు ఫిర్యాదులు అందడంతో స్థానిక పోలీస్ సిబ్బంది మెయిన్‌రోడ్డు జంక్షన్‌లో అవగాహన కల్పించారు. ఆకతాయిలు అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదై భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి వ్యవస్థలకు మరమ్మతు పనులు

బొబ్బిలి: పట్టణంలోని తాగునీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు మున్సిపల్ యంత్రాంగం గురువారం పైపులైన్లు, స్లూయిస్ వాల్వ్‌ల మరమ్మతు పనులను చేపట్టింది. స్థానిక రాణిమల్లమ్మదేవి మున్సిపల్ పార్కు దగ్గర చేపడుతున్న స్లూయిస్ వాల్వ్‌ల మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు పరిశీలించారు. ఆయన వెంట ఏఈ రవికుమార్, ఇతర సిబ్బంది ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

జనసేన సభ్యుత్వం కార్యకర్తలకు పెద్దభరోసా

రేగిడి: జనసేన పార్టీలో సభ్యుత్వం తీసుకున్నవారికి ప్రమాదబీమా రూ. 5 లక్షల అందించటం కార్యకర్తలకు పెద్దభరోసా అని జనసేన నాయకులు, రేగిడికి చెందిన హైకోర్టు న్యాయవాది మామిడి గోవిందరావు, ఆపార్టీ నేతలు యాపీ రాజు, రెడ్డి బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఉండరాడమెట్ట వద్ద జనసేన సభ్యత్వ నమోదుపై ప్రత్యేక క్యాంపైన్ నిర్వహించారు. సమస్యలపై పోరాడే జనసేన ప్రజలకు అండగా నిలుస్తుందని, పవన్‌కల్యాణ్ ఒక ఆశయంతో ఈపార్టీని ముందుకు తీసుకువెళ్తున్నట్టు, ఇందులో పార్టీలు, కులాలకు అతీతంగా అందరూ చేరాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల జనసేన నేతలు పల్లి అప్పలనాయుడు, పల్లి రఘు, మీసాల సత్యనారాయణ, గేదల రాంబాబు తదితర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా సీఆర్పీఎఫ్ బలగాలు తనిఖీ

మక్కువ: మావోయిస్టులు వారోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో స్థానిక సీఆర్పీఎఫ్ 198ఎఫ్ బలగాలు మక్కువ నుంచి ఏజెన్సీ ప్రాంతమైన దుగ్గేరు వరకు గురువారం కల్వర్టులు తనిఖీలు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతానికి వెళుతున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మక్కువ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎంసీ నోటిఫికేషన్ విడుదల

రామభద్రపురం: ఈ నెల 8న జరగనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమలప్రసాద్ కోరారు. గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలల వద్ద ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. 8న ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, మెంబర్లతో ప్రమాణ స్వీకారం చేయించనున్నట్టు తెలిపారు. ● **బొబ్బిలిరూరల్:** బొబ్బిలి మండలం అలజంగి గ్రామంలో గురువారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మోజేష్, సీబీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణదాస్ గ్రామ సచివాలయం, పంచాయతీ కార్యాలయం ఆవరణలో హైస్కూల్ నోటీస్ బోర్డ్ లలో ఉదయం 10 గంటలకు ఎస్ఎంసీ ఎన్నికలనోటిఫికేషన్, వోటర్ల జాబితాను విడుదల చేసారు.

లక్కవరపుకోట: పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికల షెడ్యూల్‌ను గురువారం విడుదల చేశారు. మండలం మొత్తం 52 పాఠశాలలకు సంబంధించిన కమిటీ నియామకాలకు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాలల్లో నోటీసులు అంటించారు. ఎంఈవో కూర్మారావు ఉన్నారు. ● **రేగిడి:** గురువారం మండలంలో 81 పాఠశాలల్లో నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంఈవో వరప్రసాదరావు గురువారం తెలిపారు. ఈనెల 8న పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో షెడ్యూల్ ప్రాప్తికి ఎన్నిక నిర్వహిస్తామన్నారు. లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం మురపాక వెంకటరమణ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ విడుదలను ఎంఈవో పర్యవేక్షించారు. ● **శృంగవరపుకోట రూరల్:** ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించిన నోటిపికేషన్‌ను ఆయా పాఠశాలల్లో ప్రదర్శించారు. దీంతో పాటు ఓటర్ల జాబిత ఉంచారు. ● **బొండపల్లి:** మండలంలోని వివిధ పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఎంఈవో-2 అల్లు వెంకటరమణ తెలిపారు. 43 ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు, 8 జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు, దేవుపల్లి కేజీబీవీలో తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



మణికంఠ (ఫైల్)

బొబ్బిలి, ఆగస్టు 1: గుంతలు, గోతులతో నిండి, అధ్వానంగా ఉన్న రోడ్లు 12 ఏళ్ల బాలుడిని బలిగాన్నాయి. ఈ హృదయవిదారక ఘటన బొబ్బిలి పట్టణంలో గు రువారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అమ్మిగారి కోనేరుగట్టు రోడ్డులో జయప్రకాశ్ స్కూలు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒమ్మెల మణికంఠ (12) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే వీధిలో ఉంటున్న తమ మేనమామ ఇంటికి సైకిల్‌పై వస్తుండగా మణికంఠను గుర్తు తెలియని భారీ వాహనం ఢీకొని బాలుని తలపై నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనలో బాలుని తల పూర్తిగా నుజ్జునుజ్జయిపోయింది. ప్రమాదానికి కారణమైన వాహనం ఆపకుండా పోవడంతో దీని కోసం గాలిస్తున్నారు. మణికంఠ గొల్లపల్లిలోని ఓ ప్రైవేట్ స్కూలులో ఏడో తరగతి చదువుతున్నాడు. తండి శ్రీను కిరాణా షాపులో పనిచేస్తుండగా, తల్లి కుమారి చిన్న గాజుల షాపును నిర్వహించుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా మణికంఠ పెద్దవాడు. కష్టపడి చదివించుకుంటున్న పిల్లలు పెరిగి పెద్దవారై ప్రయోజకుల వుతారని కోటి ఆశలు పెట్టుకున్న ఆ తల్లిదండ్రులపై విధి చిన్నచూపు చూసింది. ఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీలోని మార్చురీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అధ్వానంగా ఉన్న రోడ్లే ఈ ప్రమాదానికి కారణమని, భారీ వాహనాలు ఈ దారిలో తిరగడం వల్ల ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.

అనారోగ్యంతో గిరిజన యువకుడి మృతి

సీతంపేట: మండలంలోని గులుమూరు పంచాయతీ ఆడలి గ్రామానికి చెందిన తుండక మురళీమోహన్(32) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. గత కొంతకాలంగా జ్వరంతో బాధపడుతూ సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందాడు. జ్వరం తగ్గకపోవడంతో ఇటీవల కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకుని వెళ్లగా అక్కడ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. గులుమూరు పంచాయతీలో జనసేన పార్టీ చురుకైన కార్యకర్తగా పనిచేస్తూ మృతి చెందడం పట్ల మండల జనసేన అధ్యక్షుడు మండంగి విశ్వనాథ్, మురళీమోహన్ సంతాపం తెలిపారు.

కిడ్నాప్ ఘటనలో ఫైనాన్స్ సిబ్బందిపై కేసు

వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామానికి చెందిన కాపుగంటి కార్తికేయ (17) కిడ్నాప్ ఉదంతంపై ఎస్.కోటకు చెందిన ఎస్ఎంఎఫ్‌జీ ఫైనాన్స్ కంపెనీ సి బ్బందిపై కేసు నమోదు చేసినట్టు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ గురువారం తెలిపారు. ఇందుకు సంబంధించి నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. కార్తికేయను కిడ్నాప్ చేసిన కోలా రామకృష్ణ, కనిశెట్టి శివపై కేసు నమోదు చేయడంతో పాటు వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ కేసును ఎస్.కోట సీఐ ఉపేంద్ర పర్యవేక్షి స్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

జామి: మండలంలోని అలమండ శివారులో పేకాట ఆడుతున్నవారిపై ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. గురువారం ఈ విషయంపై ఎస్ఐ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించి పేకాటాడుతున్న ఏడుగురు వ్యక్తులతో పాటు వారి వద్ద రూ.71వేల 600 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రైతు సేవా కేంద్రంలో కంప్యూటర్, ప్రింటర్ చోరీ

బొబ్బిలి, ఆగస్టు 1: బొబ్బిలి మండలం శివడవలస రైతు సేవాకేంద్రంలో కంప్యూటర్, ప్రింటర్లను దొంగలెత్తుకుపోయారు. సచివాలయం సిబ్బంది, గ్రామ సర్పంచ్ వెంగళ లక్ష్మీనారాయణరావు గురువారం వేకువజాము నుంచి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేసి సచివాలయానికి వచ్చి చూడగా పక్కనే రైతు సేవాకేంద్రం తలుపుల తాళాలు పగలగొట్టడాన్ని గమనించారు. అక్కడ ఉండే కంప్యూటర్, ప్రింటర్‌లను దొంగలు ఎత్తుకుపోయినట్టు గుర్తించారు. దీనిపై వెంటనే బొబ్బిలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లోవరాజు తన సిబ్బందితో సహా గ్రామానికి వెళ్లి చోరీ జరిగిన రైతు సేవాకేంద్రాన్ని పరిశీలించారు. చోరీ స్థలంలో ఆధారాలను సేకరించారు. నిందితుల ఆచూకీ కోసం నిఘా పెట్టామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, చోరీకి పాల్పడ్డవారిని కొనుగొని అరెస్టు చేస్తామని ఎస్ఐ లోవరాజు తెలిపారు.

లెప్రసీపై అవగాహన తప్పనిసరి



లెప్రసీపై అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు ప్రతినిధి దీప్తి

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 1: కుష్టువ్యాధిపై అవగాహన తప్పనిసరని హీల్ ప్రాజెక్టు ప్రతినిధి డాక్టర్ తాలాడ దీప్తి అన్నారు. గురువారం పూల్‌బాగ్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలున్న వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులను పూర్తిగా అందిస్తామన్నారు. కుష్టువ్యాధి లేని జిల్లాగా అందరూ కలసి కట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీవో వంశీ, ఆశా పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఐఏంఏ ప్రతినిధులు

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 1: జిల్లా కలెక్టర్ అంబేడ్కర్‌ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ప్రతినిధులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఐఏంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టరు జేసీ నాయుడు మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, ప్రజలకు అందించే వైద్యసేవల విషయంలో ఐఏంఏ తమ వంతు సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏంఏ ప్రతినిధులు డాక్టరు శ్రీనివాస్, వీఎస్ ప్రసాద్, రవీంద్రనాథ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ అంబేడ్కర్‌ని కలిసిన ఐఎంఏ ప్రతినిధులు

తహసీల్దార్ సీజ్ చేసినా..

● రాత్రివేళ నీటి వ్యాపారం ● రెవెన్యూ సిబ్బంది సహకారంపై అనుమానం

రాజాం రూరల్, ఆగస్టు 1: రాజాంలో తహసీల్దార్ సీజ్ చేసిన వాటర్ ప్లాంట్లు చీకటిపడ్డాక తెరుచుకుంటున్నాయి. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ ఇష్టారాజ్యంగా వాటర్ కేన్లు అమ్మకాలు చేస్తున్నారు. కొంతమంది వీఆర్వోల అండదండలతో ఈ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడుస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజాం వీఆర్వోల గ్రూపులో చెక్కర్లు కొడుతున్న సమాచారం ఇందుకు బలం చేకూరుస్తోంది. వివరాలిలా ఉన్నాయి. రాజాంలో పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. లేబర్ లైసెన్స్ మినహా ఎలాంటి అనుమతుల్లేకుండా, నిబంధనలు పాటించకుండా, కేన్లు పరిశుభ్రం చేయకుండా నీటి వ్యాపారం చేస్తున్న ప్లాంట్లపై ఆంధ్రజ్యోతి ఇటీవల కథనాన్ని ప్రచురించింది. స్పందించిన రాజాం తహసీల్దార్ కృష్ణంరాజు రాజాం పట్టణంతో పాటు కొండంపేట, గురవాం తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్లను సీజ్ చేశారు. దీంతో వారం రోజుల పాటు రాజాంలో నీటి అమ్మకాలు నిలిపివేసిన వాటర్ ప్లాంట్ల యజమానులు గత రెండ్రోజులుగా సాయంత్రం వేళ ప్లాంట్లను తెరిచి నీటిని పట్టణంలో రాత్రి పొద్దుపోయేదాకా సరఫరా చేస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది అండదండలతో ప్లాంట్లు నిర్వహిస్తున్న విషయాన్ని తెలుసుకున్న రాజాం తహసీల్దార్ వీఆర్వోలను అప్రమత్తం చేశారు. కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లకు గురువారం రాత్రిలోగా తాళాలు వేసేలా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. దీన్ని సీరియస్‌గా తీసుకోవాలని స్పష్టం చేశారు.

విధుల్లోకి చేర్చుకోవాలి

గరుగుబిల్లి: పశు సంవర్ధకశాఖ పరిధిలో గతంలో విధులు నిర్వహించి, తొలగించబడిన సిబ్బందిని విధుల్లోకి చేర్చుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు పలువురు శ్రీకాకుళంలోని ఆయన స్వగృహంలో గురువారం విపతిపత్రం అందించారు. తోటపల్లికి చెందిన తోట వెంకటేష్, కురుపాంకు చెందిన ఆర్.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలువురు డీఎల్‌సీ, టీఎంటీపీ, డీఈవోలుగా విధులు నిర్వహించారన్నారు. ఆ సమయంలో పలువురిని అకారణంగా తొలగించారని చెప్పారు. మంత్రి స్పందిస్తూ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

అటల్ మారథాన్ కాంపిటేషన్‌లో జిల్లా ప్రాజెక్టుకు గుర్తింపు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: అటల్ మారథాన్ కాంపిటేషన్‌లో జిల్లా ప్రాజెక్టుకు గుర్తింపు లభించింది. 2023-24 సంవత్సరానికి అటల్ టింకరింగ్ లాబ్స్‌లకు సంబంధించి అటల్ ఇన్నోవేషన్ మిషన్ నిర్వహిస్తున్న అటల్ మారథాన్ కాంపిటేషన్స్‌లో జిల్లాలోని సీతంపేట మండలానికి చెందిన పూతికవలస ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల 261వ స్థానాన్ని కైవసం చేసుకుంది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ థీమ్‌లో ఎర్త్‌క్వేక్ ఇండికేటర్ అనే ప్రాజెక్టు జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది, తర్వాత స్థాయికి అర్హత సాధించింది. విద్యార్థిని అభిత ప్రాజెక్టును రూపకల్పన చేసింది. జాతీయ స్థాయిలో మొదటి 500 ప్రాజెక్టుల్లో ఇది ఎంపిక కావడం విశేషం. ఈ మేరకు డీఈవో జి.పగడాలమ్మ.. విద్యార్థి అభిత, గైడ్ టీచర్ హేమలత, హెచ్ఎం శారదకు అభినందనలు తెలిపారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోగా జగన్మోహన్‌రావు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: డిప్యూటీ డీఎంహెచ్‌వోగా టి.జగన్మోహన్‌రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఈయన జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్‌గా, జిల్లా మలేరియా అధికారిగా జిల్లాలో సేవలందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె.విజయపార్వతి ఆదేశాల మేరకు గురువారం ఆయన డిప్యూటీ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తానన్నారు. జిల్లా ప్రాథమిక వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.పీఎల్ రఘుకుమార్, వైద్యాధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

లక్ష్యసాధన దిశగా శ్రమించండి

పార్వతీపురంటౌన్: లక్ష్యసాధన దిశగా విద్యార్థులు శ్రమించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన విద్యా సామగ్రిని ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు, టీడీపీ నాయకులు బి.సీతారాం, జి.వెంకటనాయుడు, ఎం.వెంకటేష్, కౌన్సిలర్ గౌరునాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం రాత్రి పార్వతీపురంలో బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ ఉత్సవాలను నిర్వహించారు. జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ, రెల్లి తదితర కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

కురుపాం: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 1నుంచి సెప్టెంబరు 30 వరకు పాఠశాలల్లో విద్యార్థులు నేత్ర పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం కురుపాం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు నేత్ర వైద్య సహాయకుడు కె.రమేష్ నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి మాట్లాడుతూ దృష్టి దోషం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తుందని చెప్పారు. ఎటువంటి శస్త్ర చికిత్స (మెల్లకన్ను, గాయల వల్ల వచ్చే కేటరాక్ట్) అవసరమైతే వారికి ఉచితంగా ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి ఐ.కిరణ్‌కుమారి, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్సీ పరామర్శ

పాలకొండ: వీరఘట్టం మండలం నందివాడ గ్రామానికి చెందిన పలువురిని కొందరు దాడి చేశారు. ఈ దాడిలో గాయపడినవారు పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని ఎమ్మెల్యే పాలవలస విక్రాంత్ గురువారం పరామర్శించారు. దాడికి గురైనవారిలో బొమ్మాళి జీవరత్నం, బొమ్మాళి పవన్‌కుమార్, బొమ్మాళి శోభన్‌బాబు, బొమ్మాళీ కిరీట ఉన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఎమ్మెల్సీ కోరారు. దాడికి పాల్పడినవారిని పోలీసులు తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. పరామర్శించిన వారిలో వైసీపీ నాయకులు ఎస్‌వీఎస్ రావు, బొత్స ప్రకాష్‌రావు ఉన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించండి

సీతంపేట రూరల్: మండలంలోని ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు, బి.అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీవో గీతాంజలికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి వేతనదారులకు గత 11 వారాల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జె.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీకి సన్మానం

పార్వతీపురంటౌన్: పట్టణ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెచ్‌సీ కె. కృష్ణమూర్తికి ఐఆర్‌డబ్ల్యూఏ ఆధ్వర్యంలో గురువారం బెలగాం వృద్ధాశ్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ డా.ఎం.శ్రీరాములు, డా.యాళ్ల వివేక్ మాట్లాడుతూ సామాజిక సేవలో హెచ్‌సీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

కురుపాం: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారికి సీట్‌బెల్ట్ తప్పనిసరి అని బ్రేక్ ఇన్‌స్పెక్టర్ జిసత్యనారాయణ సూచించారు. గురువారం కురుపాంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని సూచించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పైడితల్లి, ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీహరిరావు, సిబ్బంది, వాహదారులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపుల మొక్కల తొలగింపు

కురుపాం: కురుపాం పంచాయతీ పూతికవలసకు వెళ్లే రోడ్డుకు ఇరువైపుల మొక్కలు, తుప్పలు పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని స్థానిక టీడీపీ నాయకురాలు మర్రపు నారాయణమ్మ తన సొంత డబ్బులతో మొక్కలు, తుప్పలను తొలగించే కార్యక్రమం చేపట్టారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

జియ్యమ్మవలస: చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాజీ మంత్రి, కళాశాల ఫౌండర్ శత్రుచర్ల విజయరామరాజు తన స్వగృహంలో పాఠ్య పుసకాలు పంపిణీ చేశారు. కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ ఎస్.రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయండి



రోడ్డుపై బైఠాయించిన సీపీఐ నాయకులు జీవన్, సూరయ్య, తదితరులు

జియ్యమ్మవలస: తోటపల్లి - కురుపాం రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ గురువారం పెదమేరంగి కూడలి వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి జీవన్, మండల కార్యదర్శి జిసూరయ్య ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రోడ్డు పనులు దాదాపు పూర్తయినా పెదమేరంగి కూడలి వద్ద, కురుపాం వద్ద రోడ్డు పనులు జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధర్నా వల్ల ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది. చినమేరంగి ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు ట్రాఫిక్‌కు క్రమబద్ధీకరించారు.

అమ్మ పాలు అమృతం

గరుగుబిల్లి: కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెదగుడబ, గరుగుబిల్లి, తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిపాలు ప్రాముఖ్యను వివరిస్తూ నినాదాలు చేశారు. **సాలూరు రూరల్:** శివరాంపురంలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. **గరుగుబిల్లి:** శిశువులకు తల్లి పాలతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని మండల వైద్యాధికారులు కేకే సాగర్‌వర్మ, సంతోష్‌కుమార్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

పాచిపెంట: పాచిపెంట తహసీల్దార్‌గా డి.రవి గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన పి.బాల బదిలీపై వెళ్లారు. పార్వతీపురం కలెక్టరేట్‌లో పనిచేస్తూ పదోన్నతిపై తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

వీరఘట్టం: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి జనసేన జానీ అన్నారు. గురువారం వీరఘట్టంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జనసేన సభ్యత్వ నమోదుతో ఆర్థిక భరోసాగా ఉంటుందన్నారు. జనసైనికులు పాల్గొన్నారు.

పర్యాటకంగా పెద్దగెడ్డ

● జైకా నిధులు మళ్లీ తీసుకొస్తాం ● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ● ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల



పెద్దగెడ్డ జలాశయం ద్వారా నీరు విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి, తదితరులు

పాచిపెంట, ఆగస్టు 1: పర్యాటకంగా పెద్దగెడ్డ ప్రాజెక్టును మారుస్తానని స్త్రీ శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గురువారం పెద్దగెడ్డ ప్రాజెక్టు ప్రధాన కుడి కాలువ ద్వారా 60 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా నదీ ప్రవాహంలోకి 10 క్యూసెక్కులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు సాగునీటి కోసం ఇబ్బంది పడకుండా రూ. 4.70 లక్షలతో కాలువల్లో పూడికతీతలు, జంగిల్ క్లియరెన్స్ చేపట్టినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో పూడికతీతలు తీయాలంటే సుమారు రూ.40 లక్షలు అవసరం ఉంటుందన్నారు. జైకా నిధులు ఏమయ్యాయో తెలుసుకుని.. మళ్లీ నిధులు రప్పించి అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. 'పెద్దగెడ్డ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసింది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడే. అప్పటి శంకుస్థాపన శిలాఫలకం ముళ్ల పొదల్లో ఉంది. దానిని బయటకు తీసి పర్యాటకులకు తెలిసే విధంగా పార్కులో పెడతాం. గత వైసీపీ ప్రభుత్వం పెద్ద గెడ్డ ప్రాజెక్టుకు చేసిన అభివృద్ధి ఏమీ లేదు. 2018-2019లో ప్రాజెక్టులన్నింటికీ రూ. 200 కోట్లు చంద్రబాబు నాయుడు మంజూరు చేయించారు. పెద్దగెడ్డ ప్రాజెక్టుకు రూ. 29 కోట్లు మంజూరయ్యాయి. కాగా ఈ నిధుల్లో కాంట్రాక్టర్ రూ.1.45 కోట్లు వెచ్చించి.. కేవలం పది శాతం పనులు చేశారు. గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల పనులు ముందుకు సాగలేదు. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టుకు రూ.53 కోట్లు మంజూరు చేస్తే రూ.10 కోట్ల మేర మాత్రమే పనులు చేశారు. గత వైసీపీ సర్కారు జైకా నిధులను దారి మళ్లించింది. కనీసం కాలువల్లో జంగిల్ క్లియరెన్స్, పూడికతీతలు కూడా తీయ లేదు.' అని ఆమె తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, మండల అధ్యక్షు లు పి. ప్రసాద్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, పాచిపెంట, కొటికిపెంట సర్పంచ్‌లు సంతోషి, అప్పలనాయుడు, టీడీపీ నాయకులు యుగంధర్, పోలినాయుడు పాల్గొన్నారు.

జీగిరాం జ్యూట్ మిల్లు తెరిపించేందుకు ప్రయత్నిస్తా

సాలూరు రూరల్: గత వైసీపీ ప్రభుత్వంలో మూతపడిన జీగిరాం జూట్ మిల్లు తెరిపించేందుకు తన శాయశక్తుల ప్రయత్నిస్తానని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం పించన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జీగిరాంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఈ మిల్లు తెరిపించడానికి రాష్ట్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రయత్నం చేశానన్నారు. మిల్లు యాజమానుల్లో ఒకరు అమెరికా వెళ్లడంతో చర్చలకు జాప్యం జరుగుతున్నదన్నారు. కార్మికుల ఉపాధికి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా చూస్తున్నామని చెప్పారు. జీగిరాం శ్మశానవాటిక సమస్యను మూడు నెలల్లో పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల పరమేశు, నాయకులు శ్రీరామ్ రవి, దుర్గారావు, బలగ లక్ష్మణరావు,బేత సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పార్వతీపురం రూరల్: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



జియ్యమ్మవలస: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



కురుపాం రూరల్: మొండెంఖల్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు రంజిత్‌కుమార్, సచివాలయ సిబ్బంది

● పింఛన్ల పంపిణీలో మంత్రి, ఎమ్మెల్యేలు

సాలూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలో 24, 18వ వార్డుల్లో గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్ అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె అన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి, డబ్బి కృష్ణ, హర్ష తదితరులు పాల్గొన్నారు. **సాలూరు రూరల్:** జీగిరాంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచిన ఘనత చంద్రబాబుదే..

పార్వతీపురం రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.3వేల పింఛన్‌ను నుంచి రూ.4వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం వెంకంపేటలో ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో మహమ్మద్, అఖిల్‌జావిద్, టీడీపీ మండల అధ్యక్షుడు బోను దేవిచంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి జి.చం ద్రమౌళి, సర్పంచ్ తీళ్ల కృష్ణమూర్తినాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. **పార్వతీపురం టౌన్:** పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పింఛన్ల పంపిణీ చేశారు. మజ్జి వెంకటేష్, ఎస్.భాస్కర్, గణేష్, ఎం.సత్యనారాయణ, పాలకొండ రాజశేఖర్, జి.రవికుమార్, వై.నిర్మలకుమారి, డా.చీకటి భద్రినారాయణ, పాలకొండ మరియదాసు పాల్గొన్నారు. స్థానిక 13 వార్డుల్లో ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానించారు. **సీతానగరం:** బలిజిపేట మండలం మిర్తివలస, కోటసీతారాంపురం గ్రామాల్లో పింఛన్లను ఎమ్మెల్యే విజయచంద్ర గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు పెంకి వేణుగోపాల్‌నాయుడు, పెంట సత్యంనాయుడు, వేణు, తదితరులు పాల్గొన్నారు. ● సీతానగరం మండలం మరిపివలస గ్రామంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పింఛన్లు పంపిణీ చేశారు.

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం

గుమ్మలక్ష్మీపురం: అన్ని వర్గాల అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం గుమ్మలక్ష్మీపురంలో ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పాడి సుధ, పార్టీ నాయకులు పాలూరి శ్రీనివాస్, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు. **జియ్యమ్మవలస:** మండల కేంద్రంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం అందజేశారు. టీడీపీ ప్రతినిధులు దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్, పల్ల రాంబాబుతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



పాలకొండ: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ



సీతంపేట: జెమ్స్‌లో గిరిజనుడికి పింఛన్ అందిస్తున్న దృశ్యం



వీరఘట్టం: ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న దృశ్యం



మక్కువ: ఆస్పత్రిలో పింఛన్ అందజేస్తున్న దృశ్యం



కురుపాం: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, టీడీపీ నాయకులు

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి

భామిని: విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. భామినిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన గురువారం సందర్శించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మండలంలో డిగ్రీ, ఐటీఐ కళాశాలలు లేకపోవడంతో చాలామంది విద్యార్థులు డ్రాపౌట్స్‌గా మిగిలిపోతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీఇచ్చారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ఎస్‌వీఎల్ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాటు చేయలేదేం?

అంతకముందు ఎమ్మెల్యే స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. పింఛన్ల పంపిణీకి ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఎంపీడీవో కిషోర్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం ఇచ్చినా ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అనంతరం టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన శిబిరానికి వెళ్లి పింఛన్లు, పామాయిల్ మొక్కలను అందించారు.

మా సమస్యలు పరిష్కరించాలి

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించాలని పలు గ్రామాల నుంచి ప్రజలు ఎమ్మెల్యే జయకృష్ణకు వినతిపత్రాలు అందించారు. తాలాడ గ్రామాన్ని గురువారం సందర్శించిన ఆయనను తాలాడ ఓపెన్‌హెడ్ ఛానెల్ వద్దకు తీసుకెళ్లి, అక్కడ ఇబ్బందులను వివరించారు. నదీ వరద ప్రవాహంతో నీరు మళ్లించేరవామని, వరద కాలువలో పూడికలు తొలగించకపోవడం, ఓపెన్ హెడ్ ఛానెల్ మరమ్మతులు చేయకపోవడంతో ఏ క్షణాన నదీ గర్భంలో కలిసిపోతుందోనని భయంగా ఉందని తెలిపారు. దృష్టిసారించి మరమ్మతులు చేపడితే తాలాడ, కీసర, కోసలి, ఘనసర గ్రామాల్లో వ్యవసాయ భూములకు వంశధార నీరు మళ్లించే అవకాశం ఉంటుందని నాయకులతో పాటు రైతులు వివరించారు. ఆయనతో పాటు మాజీ తోటపల్లి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ నిమ్మక పాండురంగ, టీడీపీ మండల అధ్యక్షుడు బి.రవినాయుడు, ఎం.జగదీశ్వరరావు, కిరణ్‌కుమార్, మనోజ్, రాంబాబు, బి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



జీజే కాలేజ్‌లో విద్యార్థులకు కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భామిని: మండల కేంద్రంతో పాటు పసుకుడి, బత్తిలి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినట్టు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రతి శుక్రవారం ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **గరుగుబిల్లి:** మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నారు. ఈమేరకు మండల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బి.శంకరరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. **పాలకొండ:** పాలకొండ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ సీతంపేట లైన్ నిర్వహణ పనులు మేరకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. సింగన్నవలస, పరశురాంపురం, వెలగవాడ, లుంబూరు, ఓని, రుద్రిపేట, గుడివాడ, సిరి కొండ, కొత్తఊరు తదితర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

127 పాఠశాలల్లో ఎన్నికలు

కొమరాడ: మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంఈవో జె.నారాయణస్వామి తెలిపారు. మండలంలో 127 పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈమేరకు ప్రతి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో పాటు పాఠశాల నోటీసు బోర్డులో ఉపాధ్యాయులు నోటిఫికేషన్ అతికించారని తెలిపారు.

ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలి

వీరఘట్టం: పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో ఆనందరావు అన్నారు. వీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాల(బాలికలు)లో గురువారం నిర్వహించిన హెచ్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడితోట, స్టూడెంట్ కిట్లు, అటెండెన్స్, మధ్యాహ్న భోజన కార్యక్రమాలు స క్రమంగా నిర్వహించాలన్నారు. ఎంఈవో డి.గౌరీనాయుడు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



ఒడిశా

అలరించిన నృత్యాలు



నృత్యపోటీలో పాల్గొన్న మహిళలు

రాయగడ: స్థానిక లయన్స్ క్లబ్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన మహిళల నృత్య పోటీలు అలరించాయి. లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో జ్యోతి సంజుత, బి.అనూష, ధనలక్ష్మి పాత్రోలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. జూనియర్ విభాగంలో భవ్యగులాని ప్రథమ, వినీతనాయక్ ద్వితీయ, సునీత సంపంగి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా సుజాతపాలో, సుస్రితదాస్‌లు వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ దుఃఖీశ్యామ్‌దాస్, డా.లక్ష్మీనారాయణ సాహు, టి.జయరాం, శతపష్టిపతి, అశ్వినిదాస్, వి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

లొంగిపోయిన హత్య కేసు నిందితుడు

రాయగడ: స్థానిక కస్తూరినగర్ కాలేజిరోడ్డులో సోమవారం రాత్రి భార్యను హత్యచేసి పరారయిన నిందితుడు పలక గౌరి బుధవారం ఉదయం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. గౌరి నేరుగా పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఐఐసీ నిహర్‌రంజన్ బీకే కహర్ ఎదుట నేరం అంగీకరిస్తూ లొంగిపోయడని గురువారం పోలీసులు తెలిపారు. గౌరిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించామని పోలీసులు తెలిపారు.

శ్రద్ధాశక్తులతో ఉన్నత శిఖరాలు



ప్రసంగిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కరరౌయిత్

రాయగడ: విద్యార్థులు అధ్యాపకులు బోధించిన విషయాలను శ్రద్ధాశక్తులతో విని క్రమశిక్షణతో మెలిగిన నాడు ఉన్నత శిఖరాలను చేరుకోగలరని అదనపు కలెక్టర్ భాస్కరరౌయిత్ అన్నారు. స్థానిక మహిళా కళాశాల వార్షికోత్సవం సందర్భంగా కళాశాల గవర్నింగ్ బాడీ అధ్యక్షుడు దుష్మంత్ మహంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రశంగించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ సుసోమదాస్, ప్రిన్సిపాల్ అర్చనా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

